IV

# వివేకపద చిహ్నములు

ఈ వ్యాఖ్యానమును రచించిన మా తండ్రిగారు ఈ గ్రంథపు ముద్రణము జరుగుచుండగా వారి మరియొక గ్రంథమయిన శ్రీకృష్ణకర్ణామృత వ్యాఖ్యానమును ముద్రించుటను పూర్తిచేసి ఆ గ్రంథమును బృందావనములోని శ్రీకృష్ణునికి స్వయముగా సమర్పించుటకై ఆ క్షేత్రమునకు వెళ్ళిరి. అప్పటికి ఆయనకు నిరంతర జ్ఞానశోధన, ఆధ్యాత్మిక సాధనములచే బడలిన శరీర ధర్మము, మా తల్లిగారి వియోగమున నలగిన మనసు-సహకరింపకున్నను ఆధ్యాత్మిక భావుకావేశముతో ప్రయాణించి వెళ్లివచ్చిరి. ఈ ప్రయాణమున ఆరోగ్యము తీవ్రముగా దెబ్బతినుటవలన ఈ వివేకచూడామణీ వ్యాఖ్యాన గ్రంథపు ముద్రణమును పూర్తి చేయకనే వారు సిద్ధిపొందిరి. వారు తమ పూర్వ ముద్రిత గ్రంథములన్నింటికిని పరిశోధనాత్మకములును అపూర్వ విషయ ఆవిష్కారకములును అయిన విపుల పీఠికలను పొందుపరచి యుండుట, వారి గ్రంథముల పాఠకులకందరికిని సుపరిచితము. వారి గ్రంథము అనగానే అట్టి యొక పీఠికకై వెదకికొను పాఠకులకు ఇట అట్టి పీఠిక కనపడకపోవుట నిరాశ కలిగించునని మాకు తెలియును.

ఈ గ్రంథముద్రణ కార్యమును పూర్తి చేయుటలో పాలుపంచుకొనుచుండగా వారి వ్రాతప్రతిలో వారు "మాయా" శబ్దమునకు శంకరభాష్యములనుండి గుర్తించి వ్రాసికొనిన ఒక అపూర్వ వివరణ కనబడినది. వారు పీఠిక రచించి యున్న ఇట్టి విశేషముల నందు చేర్చి యుండెడి వారేమో అనిపించినది. గ్రంథములోపలను 74వ శ్లోకముతో మొదలగు 'స్థూలశరీరోపవర్ణనము' అను విభాగమునందలి 'అనాత్మ తత్త్వ వర్ణనము' అను ఉపవిభాగమునకు అధికార వాక్యములను (ఉపోద్ఘాత పూర్వక వ్యాఖ్యాన వాక్యములను) వ్రాయుచు 'వివేకచూడామణి' అను గ్రంథనామము నందలి ఔచిత్యమును తమదైన మార్గమున వివరించి యుండుట కనపడినది. గ్రంథమున కనపడిన ఇట్టి విశేషములపై పాఠకుల ధ్యానము విశేషించి లగ్నమగునట్లు చేయుచు కొన్ని మాటలను ఈ గ్రంథమునకు ముందుభాగమున చేర్చుట కారణ జన్మలయిన ఆ సిద్ధపురుషుని ఆలోచనములకు దగ్గరగ నుండునేమో అని తోచినది. కావునన ఈ ప్రయత్నము.

వారి పూర్వగ్రంథములను చదివిన పాఠకులకు ఈ గ్రంథమున మరొక ప్రత్యేకతయు కనపడవచ్చును. ఇచ్చట శ్లోకములకు వారు సాధారణముగ అందించు సరళమైన ప్రతిపదార్థమువంటి తాత్పర్యమును అందించలేదు. పూర్వము మద్రాసు శ్రీరామకృష్ణమఠము వారు పునర్ముద్రించిన వావిళ్లవారి ప్రచురణ అయిన వివేకచూడామణిలో శ్రీకామార్షి వేంకట సుబ్బయ్యగారు రచించిన ప్రతిపదార్థము ఉన్నది. పితృపాదులు ఈ గ్రంథమున అట్టి పూర్వగ్రంథముల కంటె విశేషించి తాము అందించు వివరణమును మాత్రము అందింపదలచినట్లు కనపడుచున్నది. వివేకచూడామణికి పూర్వమున్న ప్రతిపదార్థ తాత్పర్యవివరణములతోను తెలుగు వ్యాఖ్యానములతోను ప్రకృత వ్యాఖ్యానమును పోల్చిచూచినవారికి ప్రతి అంగుళమునను అట్టి ప్రత్యేకత తప్పక కొట్టవచ్చినట్లు కనపడును.

ప్రాచీన గురుకులపద్ధతిలో గురుగృహవాసము చేసి గురుశుశ్రూషచేసి మధుకరి చేయుచు గురువుల నుండి సంపాదించిన శాస్త్రపాండిత్యము ఈ వ్యాఖ్యాతది. దానిని దినమునకు దరిదాపు ఇరువది గంటల పాటు నిరంతరముగ చేసిన స్వీయాధ్యయనము ద్వారా శాస్త్రీయ నిర్దుష్టతా నైశిత్యములతో కఠోరముగ సానబెట్టి పెంపొందించుకొనిరి. అట్టి జ్ఞానసాధనయే నైసర్గిక జీవన విధానముగ నుండియు, ఆధునిక గణితాది అనేక ఆధునిక శాస్త్రములలో అపారమయిన కృషిని చేయుచును, ఇరువది యైదునకు పైగా భాషలు నేర్చి వానిలో గ్రంథముల నధ్యయనము చేయుచును కూడా ఆయన సకల శాస్త్రపారంగతత్వము కన్నను ఆధ్యాత్మిక స్వీయానుభవమే మిన్నయని త్రికరణ శుద్ధిగ నమ్మినవారు. అట్టి స్వీయానుభవమునకే ప్రాముఖ్యమునిచ్చుచు అట్టి తమ అనుభవములను పంచుకొనుటకై తమ వద్దకు వచ్చు పాండిత్య విరహితులయిన పాఠకులతో వారి ఉపాధిలక్షణములను పాటింపక ఆత్మీయతానురాగములతో మెలగినవారు. అనితర సాధ్యమయిన నైష్ఠిక నైతిక సాధు జీవితమును జీవించినవారు. ఆడంబరములనుండి వికర్షణ, సారళ్యముపట్ల ప్రీతి గలిగిన శాలీనతామూర్తి. పూర్వ జన్మసిద్ధములేమో అనిపించెడి వారి ఆధ్యాత్మిక అనుభవముల నిదర్శనములకు వారి సాధక మిత్రులు, అనుయాయులతో పాటు వారి కుటుంబ సభ్యులమయిన మేమును అనేకానేక పర్యాయములు ప్రత్యక్షసాక్షులుగ నిలుచుట మా పురాకృత పుణ్యఫలము.

వైజ్ఞానిక వివరణములకు అందని వారి అట్టి అనుభవములనన్నింటినీ వర్ణించిన ఒక గ్రంథమే యగును. ప్రకృతమునకు వాని యందు ప్రకృత గ్రంథ విషయమునకు సంబద్ధములయిన వానిని మాత్రము ప్రస్తావింతును. అవి వారు శ్రీవిష్ణుసహస్రనామ శంకర భాష్యమును తెలుగు చేయుచున్న రోజులు. ఆ రచనా కాలమున వారికి ధ్యానమున దర్శనమిచ్చి ఉపదేశము చేసిన శ్రీశ్రీశ్రీ చంద్రశేఖరేంద్రసరస్వతీ స్వాముల వారు తరచుగ దర్శనమిచ్చుచు మార్గదర్శనము చేసెడివారు. 'చతుర్వ్యూహః' అను నామమునకు స్వామివారు విశేషార్థము నట్లు ఉపదేశించుటను వారు మాకు చెప్పియుండిరి. అప్పటికి నాన్నగారు, స్వామివారు ఒకరినొకరు ప్రత్యక్షముగ కలసికొని యుండలేదు. వారిరువురును ప్రత్యక్షముగ మొదటిసారిగా కలసికొనినది ఆర్కాటు జిల్లాలోని కలవై గ్రామములో. ఆ కలయిక సందర్భమున నేనచ్చటనే యుంటిని. స్వామివారి దర్శనమునకై కంచికి వెళ్లి వారచ్చట లేరని కలవైలో నున్నారని తెలిసి మేము వెళ్లితిమి. స్వామి వారు అప్పటికి రెండున్నరేండ్లుగా పట్టిన మౌన వ్రతమును నాయన గారిని పలకరించుటకై వీడిరి. "నేను 'చతుర్వ్యూహః' అను నామము విషయమున తెలియజేసిన విశేషములను కేంద్రముగా జేసికొని శంకరుల వారి దర్శనమును గూర్చి మఠములోని పండితులకును, స్వాములకును వివరింపుడు" అని నాన్న గారితో అనిరి. అది విని నాన్నగారు ముందుగా చెప్పిన విషయము గుర్తుకు వచ్చి నేను ఆశ్చర్యచకితుడనయితిని. (పిమ్మట కొన్ని దినములకు నాయనగారు నాకును మా చిన్నన్నగారైన శ్రీధరబాబుకు శ్రీదక్షిణామూర్తి స్తోత్ర వివరణ ద్వారమున అద్వైత వేదాంత సారమును, శంకరుల వారి పరంపరను ఉపదేశించిరి.)

మరి కొన్ని దినములకు నాయనగారికి ఒక రాత్రి గౌడపాదుల వారు దర్శనమిచ్చి కొన్ని గంటలపాటు అనేక విషయములను చర్చించిరి. తెల్లవారిన పిమ్మట మా అమ్మ "ఏమండీ రాతంత్రా మేల్కొని మీరు ఈ ఈ ఆకారములో ఉన్న ఒక తేజస్వి అయిన వృద్ధుడితో ఇటువంటి ఇటువంటి విషయాలు చర్చించారు కదా!" అనినది. తనకు మాత్రమే గోచరించినదనుకొన్న అనుభవము ఆమెకు కూడ కనపడినదని తెలిసి కొంత ఆశ్చర్యపడి నాన్నగారు "ఔను, ఆయన గౌడపాదులవారు. వారితో నువ్వు చెప్పిన విషయాలే చర్చించాను" అనినారు.

ఇట్టి నేపథ్యమున వారు తమ అద్వైత వేదాంత విచారణమును నిరంతరము సాగించెడివారు.

"ఏ శాస్త్రమున అయినను ఏ అధ్యయన రంగమున అయినను నేర్చిన బహువిధ విషయములను వానిలోనొక అంశమును కేంద్రముగ చేసికొని దానితో సమన్వయము చేసికొనుచు అవగాహన చేసికొనుటయే సరియైన జ్ఞానార్జన మార్గమని" వారు తరచుగ మాతో అనెడివారు.

మొత్తము మీద వారు అనుభవమునకే ప్రాధాన్యమునిచ్చుచు అద్వైత సాధనమును సాగించెడివారు. అట్టి అనుభవరూప సాధనకు సిద్ధి ఇట్లుండును అనునట్లు ఉన్న శ్రీరమణమహర్షి మీద అపార ఆదరముతో వారి గ్రంథములను తాదాత్మ్యముతో చదువుచుండెడివారు. అట్టి తమ సాధన దృష్టితో చూడగా వివేకచూడామణిలో తమకు గోచరించిన విశేషములను అద్వైతవేదాంతాసక్తులతో పంచుకొనుటకే ఈ వ్యాఖ్యానమును వారు రచించిరని అనిపించుచున్నది. టీక (ప్రతిపదార్థము), సరళతాత్పర్యము వంటి సరళాంశములను పొందుపరుపక కేవలము గంభీరమైన విషయచర్చను మాత్రము ఈ గ్రంథమున చేయుటకు ఇదియే కారణము అయి ఉండవచ్చును.

స్వీయానుభవమునకు ప్రాముఖ్యమునిచ్చు వారి స్వభావము వలననే వారికి ప్రాచీనాచార్యులలో శ్రీహస్తామలకాచార్యులవారు, శ్రీ సర్వజ్ఞాత్మముని వంటి అనుభవసిద్ధుల పట్లను అర్వాచీనులలో శ్రీసదాశివబ్రహ్మేంద్రుల వారు, శ్రీచంద్రశేఖర భారతీ స్వాములవారు వంటి అవధూతల పట్లను ప్రత్యేకాభిమానము. వీరిలో శ్రీ చంద్రశేఖర భారతీ స్వాముల వారు ప్రకృత గ్రంథము వివేకచూడామణికి తమ వ్యాఖ్యానమును తాము రచించి యున్నారు. నాన్నగారు తమ గ్రంథములో ఆయా సందర్భములలో ఆ వ్యాఖ్యానమును తరచుగ ఉదాహరించుటను గమనింప వచ్చును.

పూర్వము పోతనాదులయిన ఆధ్యాత్మిక సాధకులయిన రచయితలందరును తమ మోక్షసాధనమునకై తాము ఆయా గ్రంథములను రచించినట్లు చెప్పుకొని యున్నారు. అయినను ఆ గ్రంథములు వాని పాఠకులకు తమ ఆధ్యాత్మిక సాధనమున ఉపకరణములుగ ఉపయోగపడుచు వచ్చినవి. ఈ గ్రంథమున కూడ దీని రచయిత అయిన నాన్నగారి ధోరణి తమ సాధనమునకై తాము తమ అనుభవసిద్ధ జ్ఞానమును

ఒక చోట గుదిగ్రుచ్చుచున్నట్లు కనపడును. పూర్వ గ్రంథములవలె ఇదియు దీని పాఠకులకు తమ ఆధ్యాత్మిక సాధనమున ఉపయోగపడగలదని నిస్సంశయముగ చెప్పవచ్చును.

నిజమునకు వివేకచూడామణి వేదాంత శాస్త్రము నధ్యయనము చేయు శాస్త్రవిద్యార్థులకు ఒక ప్రకరణ గ్రంథముగ పాఠముగ చెప్పబడును. అట్టి శాస్త్రీయాధ్యయనపు గ్రంథముగ ఈ గ్రంథమునందలి శాస్త్రీయ సూక్ష్మములను పసిగట్టుటకు కావలసిన శాస్త్ర జ్ఞాన భూమిక ఈ వ్యాఖ్యాతకు ఎట్లును ఉండనే ఉన్నది. కనుక శాస్త్రదృష్టితో చదువు పాఠకులు అట్టి సూక్ష్మముల నెట్లును తప్పక గుర్తింపగలరు. కాని అట్టి పండిత పాఠకులకు కూడ ఈ గ్రంథమునందలి శాస్త్రైకదృష్టిని అతిక్రమించిన అనుభవోన్ముఖ విచారణము మరింత ఉపయోగపడగలదు.

ఆ మాటకు వచ్చిన, శ్రీభాగవత్పాదులవారే ఈ గ్రంథపు పూర్వాంగ భాగమున తామే స్వయముగా శాస్త్రజ్ఞానమునకంటె అపరోక్షానుభవమే ముఖ్యమని నొక్కి వక్కాణించి యుండుట గమనార్హము.

న గచ్ఛతి వినా పానం వ్యాధిరౌషధశబ్దతః
వినాఽఽ పరోక్షానుభవం బ్రహ్మశబ్దైర్నముచ్యతే 64

ఔషధమును త్రాగకుండగ దాని పేరునుచ్చరించుటయో వినుటయో చేసినంత మాత్రమున రోగమెట్లు నశింపదో అట్లే అపరోక్షానుభవము లేనిదే బ్రహ్మశబ్దమునుచ్చరించుటయో వినటయో చేసినంతమాత్రమున ముక్తులు కాజాలరు.

అనుచు "నేనురాజును" అన్న మాట నన్నంత మాత్రమున శత్రుసంహారమును చేయక భూసంపదను పొందక రాజుగా ఎట్లు కాజాలరో అట్లే (66వ శ్లోకము) అనుచు ఇట్లు మరికొన్ని దృష్టాంతములను ఇచ్చుచు పోయి అపరోక్షానుభవమునకు గల ప్రాముఖ్యమును శ్రీభగవత్పాదులే స్వయముగా గుర్తుచేసియున్నారు.

ఈ సందర్భమున వారు నుడివిన "శబ్దజాలం మహారణ్యం చిత్తభ్రమణ కారణం", "భుక్తయే నతు ముక్తయే " వంటి వాక్యములు, వాక్యాంశములు పండిత సంభాషణములలో సామెతల వలె తరచుగ దొరలుచుండును కూడ.

ఈ ప్రసంగమున ఎంతో చమత్కారపూర్వకముగ శ్రీ శంకరులవారు

"అవిజ్ఞాతే పరే తత్త్వే శాస్త్రాధీతిస్తు నిష్ఫలా
విజ్ఞాతేఽ ఽపి పరే తత్త్వే శాస్త్రాధీతిస్తు నిష్ఫలా"

పరతత్త్వము (అనుభవరూపమున) తెలియనినాడు శాస్త్రాధ్యయనము వ్యర్థము. పరతత్త్వము (అనుభవరూపమున) తెలిసిన నాడు కూడ శాస్త్రాధ్యయనము వ్యర్థము. అని సెలవిచ్చినారు.

ఈ చమత్కారములోని జటిలమైన సూక్ష్మము నంతే సూక్ష్మబుద్ధితో గ్రహింపదగును.

ఎట్లును శాస్త్రాధ్యయనము వ్యర్థమే అనునది ఇచట తాత్పర్యము కాదు. "ఓ శాస్త్రాధ్యేతలారా! మీరు ఈ శాస్త్రపు పరమ లక్ష్యమయిన పరతత్త్వానుభవమును పొందుటకై సర్వధా ప్రయత్నింపుడు. అట్టి అనుభవమును పొందని నాడు మీ అధ్యయనము వ్యర్థమగును." అని ఈ శ్లోకపు పూర్వార్థమున శ్రీమద్భగవత్పాదుల ఉద్దేశ్యము. శ్లోకపు ఉత్తరార్ధమున శ్రీరామకృష్ణపరమహంస, శ్రీరమణమహర్షి వంటి అనుభవసిద్ధులు శాస్త్రాధ్యయనము చేసియుండక పోవుటను లోపముగ భావింపరాదని, అట్టి వారికి శాస్త్రాధ్యయనము అనావశ్యకము అని వివరించుచున్నారు.

ఈ గ్రంథములోని ఇట్టి వాక్యముల ద్వారమున ప్రత్యక్షముగ ఇట్లు స్వానుభవ సాధన ప్రాముఖ్యమును బోధించుటయే కాక ఈ గ్రంథనిర్మాణ విధానమును, ఈ గ్రంథపు శైలిని, రచనా శిల్పమును కూడ ఆ లక్ష్యమునకు తగినట్లే శ్రీ భగవత్పాదులు నిర్వహించినారు. శ్రీమద్భగవద్గీతను వ్యాసమహర్షి నిర్వహించినట్లే శ్రీ శంకర భగవత్పాదు లీ వివేకచూడామణిని ఒక గురుశిష్య సంవాద రూపమున నిర్వహించినారు. వేదమంత్రములు, ఉపనిషన్మంత్రములతో మొదలుకొని అనేక భారతీయ ప్రాచీన గ్రంథములలో కనపడు ఈ సంవాదపద్ధతి విషయబోధనమున కెంత చక్కని మార్గమో ఆధునిక విద్యావేత్తలందరునూ గుర్తెరిగిన విషయమే.

అంతకంటె ముఖ్యముగ గమనింపదగిన అంశము శాస్త్ర విషయ ప్రాధాన్యము గల ఈ గ్రంథమును శ్రీశంకరులవారు రసవత్కావ్యముగ నిర్వహించి యుండుట. గ్రంథారంభమున 37వ శ్లోకము మొదలు 42వ శ్లోకము వరకు శిష్యుడు గురుని ప్రార్థించిన విధములోని వినయము, ఆర్తి రసవంతములుగ అనుభూయమానము లగుచుండగా అంతే రసవంతముగ గురువు.

"మా భైష్ట విద్వంస్తవ నాస్త్య పాయః
............................................" (45శ్లో.)

అనుచు వాత్సల్యపూర్వకముగ సమాధానమునిచ్చుట రసానుభూతి కారకములుగ నున్నవి. నడుమ, నడుమ శిష్యుని సంప్రశ్నము, గురువు చేసెడి సంశయ నివృత్తి సందర్భములలో కూడ నిట్లే కేవల విషయప్రధాన శైలి గాక భావావేశ పూర్వకమయిన రసోద్దీపకమయిన శైలి కనపడును. చివరగా గ్రంథపు ఉపసంహార భాగమున కూడ శిష్యుడు తనకు కలిగిన అనుభవ సిద్ధిని వ్యక్తము చేయుసందర్భమున (481 శ్లో నుండి 520 శ్లో వరకు) ఇట్టి ఉద్విగ్నభావావేశపూర్వకమయిన అభివ్యక్తిగల మాటల ధారతో అనుభూతిలోని పతాకస్థితిని, దాని వలన కలిగిన ఆనందమును గురువు పట్ల కృతజ్ఞతాభావమును రసతాదాత్మ్యముతో పాఠకులును రసపరవశులయిపోవునట్లు చేయుట శ్రీశంకరులవారీ గ్రంథమున పాటించిన అనుభూతి ప్రధానమయిన రచనా విధానమునకు మరియొక నిదర్శనము. కట్టకడపటికి (577, 578 శ్లోకములలో) గురు శిష్యుల నిష్క్రమణమును వర్ణించిన విధముకూడ నొక రసవత్కథా కావ్యములోని రసపూర్ణమయిన సమాప్తిని తలపించుటతో ఈ గ్రంథపు అనుభూత్యున్ముఖమయిన రచనా శిల్పమునకు పరిపూర్ణత్వము సిద్ధించినది. వివేకచూడామణి పాఠకులీ గ్రంథములోని ఏకదేశగత శాస్త్రాంశములను పృథక్ పృథక్‌గా గ్రహించుచు నుండిపోక గ్రంథసమష్టిని సమాహిత దృష్టితో గ్రహించి ఆద్యంతమును ఏకధారగా ఇట్టి అనుభూతులలో లీనమగుచు చదివిన గ్రంథపరమార్థమును తమ పరమార్థము కూడ సిద్ధించును.

ఇచ్చట మఱియొక గమనార్హమయిన అంశము కలదు. ఈ గ్రంథముపదేశించు చున్నది మనకిప్పుడు లేని ఒక అనుభూతిని ఎచ్చటినుండియో తెచ్చుకొనుమని కాదు. మనమిప్పుడు జీవించుచున్నామనగా జీవితము ననుభవించుచునే యున్నాము. ప్రతిక్షణమును 'నేను ఉన్నాను', 'నేను ఇట్లు చేయుచున్నాను' 'నేను దీనిని పొందుచున్నాను' అను ఇట్టి అనుభూతిని పొందుచునే ఉన్నాము. అయినను ఈ అనుభూతిని గుఱించి తరచి చూచి దానిని విశేషించి చూచుట మాత్రము చేయుటలేదు. ఉదాహరణమునకు 'నేను ఉన్నాను' అను ఈ అనుభూతిలోని 'నేను' అనగా ఏమి? 'నేను' కాని ఇతరములను కదా మనము 'నేను దీనిని చూచితిని

వంటి అనుభూతులలో 'ఇది', 'దీనిని' 'నిన్ను' 'వారిని' వంటి రూపములలో భావించుచున్నాము? ఈ 'నేను కానిది' ఏది? అను వివేచనము నేర్పు గ్రంథమే ఈ వివేకచూడామణి. ఆత్మ అనగా తాను. ('తాను' 'నేను' అను ఉత్తమ పురుష సర్వనామమునకు ప్రథమ పురుష రూపము.) అనాత్మ అనగా తాను కానిది. (అనగా నేను కానిది.) 'నేను ఏది?' 'నేను కానిది ఏది?' అను ఈ విశ్లేషణనే 'ఆత్మానాత్మ వివేక' (ఆత్మ- అనాత్మ- వివేచన) అందురు. ఆ విశ్లేషణను నేర్పు గ్రంథము కనుకనే దీనికి 'వివేక' అనగా 'వివేచనమునకు' 'చూడామణి' అను పేరు వచ్చినది. కనుక ఈ గ్రంథము మనమిప్పుడు పొందుచున్న అనుభూతిని విశ్లేషించు విధానమును నేర్పుచున్నదే కాని కొత్త అనుభూతిని బయటినుండి తెచ్చుకొనుమని చెప్పుటలేదు. ఇట్టి వివేకము లేక పొందెడి అనుభూతి కంటె వివేకము కలిగిన పిమ్మట పొందు అనుభూతి భిన్నమై యుండుటచే ఈ అనుభూతి క్రొత్తగా 'పుట్టినట్లు' 'వచ్చినట్లు' అనిపించును.

ఈ గ్రంథమున (పై 'ఆత్మానాత్మ వివేకము' అను పదము వలెనే) కనపడు మఱియొక అత్యంత కీలకమయిన పదము 'సర్వాత్మత్వము'. ఈ గ్రంథమునందు ప్రతిపాదితమయిన సిద్ధాంతమునకు సర్వాత్మత్వసిద్ధాంతమను పేరును శ్రీశంకర భగవత్పాదులే గ్రంథమున ఉపయోగించినారు. (ఉదా: 340 శ్లో, 342 శ్లో, 356 శ్లో.) ఈ 'సర్వాత్మత్వమ'ను పదము శ్రీశంకరుల మఱొక ప్రముఖ కృతి అయిన శ్రీదక్షిణామూర్తి స్తోత్రమున ఉపయోగింప బడినది. ఆ స్తోత్రములోని ప్రధాన శ్లోకములు ముగిసిన వెంటనే వచ్చు ఫలశ్రుతి శ్లోకము

"సర్వాత్మత్వమితి స్ఫుటీకృత మిదం యస్మాద ముష్మింస్తవే

..............................................................."

అని ప్రారంభమగును. "సర్వాత్మత్వము' అని స్పష్టము చేయబడిన ఈ ఏ దక్షిణామూర్తికమయిన స్తోత్రము కలదో దానిలో" అని ఇచ్చట అనుట వలన ఆ స్తోత్రమునే సర్వాత్మత్వము అని పిలుచుచున్నట్లగుచున్నది. ఆ 'సర్వాత్మత్వము' అను పదమే ఈ గ్రంథమున కీలకముగా నుండుట వలన 'వివేక చూడామణి' 'శ్రీదక్షిణామూర్తి స్తోత్రము' అను ఈ రెండు రచనల నడుమ గల సాన్నిహిత్యము అభిన్నత్వము స్పష్టమగుచున్నది. ఆ కారణముగా ఈ వ్యాఖ్యాన గ్రంథమునకు అనుబంధముగా

ఈ వ్యాఖ్యాతచేతనే రచింపబడిన శ్రీదక్షిణామూర్తి స్తోత్రవ్యాఖ్యానము పొందుపరచబడు చున్నది. పైన పేర్కొనబడిన "సర్వాత్మమితి" అను శ్లోకములో చెప్పినట్లే శ్రీ దక్షిణామూర్తి స్తోత్రమును వినుచు, దాని అర్థమును మననము చేయుచు, ధ్యానించుచు సంకీర్తనము చేయుచు పోయిన క్రమముగా (ఈ వివేక చూడామణి ఉపదేశించు చున్న) వివేకముతో కూడిన అనుభూతి మనలో స్థిరపడుట తథ్యము.

**మరొక విషయము:**

వివేకచూడామణి గ్రంథములోని "మోక్షకారణసామగ్ర్యాం భక్తిరేవ గరీయసి" అను ఈ వాక్యము తరచుగ చర్చనీయమగుచుండును. ఈ వాక్యమును కొందరు 'జ్ఞానమార్గ' పారమ్యమును బోధించువారిగా ప్రసిద్ధులయిన శంకరులవారు 'భక్తిమార్గ'పారమ్యమును ఇచట ప్రతిపాదించియుండుటగా చెప్పుచుందురు. శంకరులవారు "జ్ఞానమార్గ" మను పేర లోకమున (చూడబడుచున్న) విచారణ మార్గమునకు మాత్రమే ప్రాధాన్యము నిచ్చుచు సగుణోపాసనమును భగవన్నామగుణరూపలీలా సంకీర్తన రూపమున భక్తిని పూర్తిగా నిరాకరించిరి అను ఒక అభిప్రాయము తరచుగ వినపడుచుండుటను చూచి వారి వాదమునకు ప్రతివాదము చేయుచు వివేకచూడామణిలోని ఈ వాక్యముల నుదాహరించుచుందురు. భగవత్పాదులవారు సగుణోపాసనమును, భగవన్నామ గుణరూపలీలా సంకీర్తన రూపమున భక్తిని నిరాకరించిరను నభిప్రాయము సమీచీనము కాదు. నాన్నగారు భగవత్పాదులు శ్రీవిష్ణు సహస్రనామ భాష్యమున అన్నమాటలను ఉదాహరించుచు ఈ విషయమునే తరచుగ చెప్పెడివారు. అద్వైత సిద్ధికి జీవద్రూపముగ నుండిన శ్రీచంద్రశేఖరేంద్ర సరస్వతీ స్వాముల వారు శరీరమును చాలించు వరకుకు అట్టి భ సాధనమును చేసియుండుట ప్రసిద్ధమే. కాని విచారణ మార్గ (స్వానుభవ అంతర్ము వివేచనా మార్గ) ఉపదేశకమయిన ఈ వివేకచూడామణీ గ్రంథములోని 32 శ్లోకములోని 'భక్తిరేవగరీయసి' అను వాక్యమున మాత్రము శ్రీ శంకరులవారు భగవన్నామగుణరూపలీలలను ఆడిపాడి తాదాత్మ్యమును చెందు అట్టి 'భక్తి'గాగా "స్వస్వరూపాను సంధానం భక్తిరిత్య భిధీయతే' అని ఇదే శ్లోకమున స్పష్టము చేయుచు 'భక్తి' పదమును విచారణ మార్గపరమయిన విశేషార్థమున ఉపయోగించిరి గ్రహింపవలసి యున్నది.

ఇంతకును ఈ మాటలన్నింటిని ఇచ్చట వ్రాయునట్లు కదలించిన ఈ గ్రంథపు వ్రాత ప్రతిలోని నాన్నగారి పరిశీలనా లేఖనము ఇది:

మాయాశబ్దార్థః శ్రీశంకరభగవత్పాదైరుక్తః

అక్షరః- భగవన్మాయాశక్తిః- క్షరాఖ్యస్య (వైరాజస్య) పురుషస్య ఉత్పత్తి బీజం- అనేక సంసారిజన్తుకామ కర్మాది సంస్కారాశ్రయః (భాష్య- భగ- 15అ.

మాయాభిః- ఇంద్రియప్రజ్ఞాభిః- అవిద్యారూపాభిః- (భాష్య-గౌడ.కా. అద్వైత ప్ర.24కారికా.)

మాఙ్-మానే- అనుధాతువునుండి నిష్పన్నములగు నిర్మాణ- నిర్మితి- ప్రమాణ- ప్రమితి- శబ్దముల గూర్చి ఆలోచించగా అదియేధాతువునుండి నిష్పన్నమగు మాయాశబ్దము- కర్మము- జ్ఞానము- అనుఅర్థములను ఇచ్చునవకాశము కలదు. ఈ అభిప్రాయముతోనే శ్రీశంకరభగవత్పాదులు మాయాశబ్దమునకు పై రెండర్థములను ప్రతిపాదించియున్నారు.

ఇచ్చట నాన్నగారు ఎత్తి చూపుచున్నది శ్రీ శంకరులవారి శబ్దముల వ్యుత్పత్తి విశ్లేషణ విధానములోని ప్రతిభను. 'మాయా' శబ్దమునకు ఒకచోట 'కర్మ'లతోనూ, మరొకచోట జ్ఞానముతోనూ ముడిపెట్టి శంకరుల వారు అర్థము చెప్పియుండుటను చూచి 'మాఙ్-మానే' అను ధాతువునకు 'నిర్మాణ', 'నిర్మితి' వంటి పదములలో కర్మ అను అర్థము, ప్రమాణ', 'ప్రమితి' వంటి పదములలో జ్ఞానము అను అర్థము ఉన్నది కదా! దీనిని గ్రహించియే శంకరులు ఈ వ్యుత్పత్తిని సూటిగ చెప్పకపోయినను, పరోక్షముగ సూచించుచు పై కర్మార్థ దృష్టితో గీతాభాష్య వాక్యములను జ్ఞానార్థ దృష్టితో గౌడపాదకారికా భాష్య వాక్యములను రచించినారని నాన్నగారు చెప్పదలచినారు. శ్రీశంకరుల వారొక గొప్ప Linguist అని నాన్నగారు తరచుగ మాతో అనెడివారు. సాంప్రదాయకములు కాని స్వతంత్ర శబ్దవ్యుత్పత్తులు చెప్పులక్షణమును, శబ్దార్థములను చెప్పుటలో అట్టి వ్యుత్పత్తులకు ప్రాముఖ్యమునిచ్చుటను ఆయన ఈ Linguist అను పదముతో సూచించెడివారేమో.

నాకు జూడ శంకరులవారి ఈ రెండు వివరణములలో మఱియొక విశేషము

కనపడుచున్నది. 'మాయ'ను వివరించునపుడు దానిని 'బ్రహ్మమును' ఆవరించిన శక్తిగా వర్ణించి బ్రహ్మపదార్థమే అయిన జీవుని జీవత్వమునకు ఆ బ్రహ్మపదార్థముపైని మాయావరణమును కారణముగా చూపుట జరుగుచుండును. కాని శంకరులవారి ఈ రెండు వాక్యములలోను మాయను "బ్రహ్మపదార్థము నావరించి జీవత్వమునకు కారణమగుచున్న బ్రహ్మపదార్థపు ఆవరణము"గా కాక "జీవులు తమలోని బ్రహ్మత్వమును గుర్తించుటకు ఆటంకముగా వారిలోని లోపముగా నున్న అంశము"గా నిర్వచించుట అనగా బ్రహ్మపదార్థము వైపునుండి కాక జీవుల వైపునుండి మాయను నిర్వచించుట అను అపూర్వాంశము కనపడుచున్నది అని అనిపించుచున్నది. జీవుల ఆధ్యాత్మిక సాధనమునకు ఇట్టి జీవుల పరమయిన వివరణమే ఉపయోగకరము కదా!

మొత్తము మీద నాన్నగారి రూపములో మాకు తమ సాన్నిధ్యము ననుగ్రహించిన మా గురుమూర్తుల ఆధ్యాత్మిక సాధనలోని పండుదశలోని ఈ మహాగ్రంథములో విజ్ఞులైన యోగ్యపాఠకులు గ్రహించగలుగు మఱియెన్నో విశేషములు నిస్సంశయముగా నున్నవి. వాని వైపునకు దిక్ప్రదర్శనము చేయుటకే ఈ ప్రయత్నము. ఈ ప్రయత్నములో లోపములున్న నవి నావే కాని ఆ సిద్ధపురుషునివి కావని గ్రహింపప్రార్థన.

భవదీయుడు

పాతూరి నాగరాజు